క్లుప్తంగా

ప్రశాంతంగా వేలం పాట



పెన్నహోబిలంలో వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం వేలం పాట ప్రశాంతంగా జరిగింది. ఆలయ ఈఓ విజయ్‌కుమార్, పర్యవేక్షణ అధికారి, డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాణిల ఆధ్వర్యంలో జరిగిన వేలం పాటలో తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం వేలం నిర్వహించగా, 18 మంది డిపాజిట్ చెల్లించారు. రూ.లక్షల వద్ద పాట ఆగింది. దీంతో వేలం పాటను రద్దు చేశారు. టెంకాయలు విక్రయించే హక్కు కోసం 26 మంది డిపాజిట్ చెల్లించగా, ఇందులో గుంతకల్లుకు చెందిన రంగ నాయకులు అనే పాటదారుడు రూ.23,65,000 పాటను దక్కించుకున్నాడు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్సీలు

అనంతపురం అర్బన్: భూమిని ఆక్రమించిన వారి నుంచి రక్షణ కల్పించి, న్యాయం చేయాలని ఎస్సీ సంఘాల నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఎస్సీ సంఘాల నాయకులు నెరమెట్ల ఎల్లన్న, లక్ష్మన్న, రామాంజనేయులు మాట్లాడారు. కూడేరు మండలం కడదరగుంట గ్రామం మాదిగ వర్గానికి చెందిన లక్ష్మీదేవి కుటుంబం ఉమ్మడిగా ఉన్నారన్నారు. సర్వే నంబర్ 27-2లో 11 ఎకరాల భూమి తమకు తాతల నుంచి సక్రమించిందన్నారు. అయితే గ్రామానికి చెందిన కొందరు భూమిని ఆక్రమించి, ఆన్‌లైన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులు రమేష్, రామచంద్ర, లక్ష్మీదేవి, కిష్టప్ప పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ వెంకట్ నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని ఆయ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఓడీఎఫ్ సర్వే పక్కాగా చేపట్టాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శులు కవిత, రవి, అనిల్, వెంకటరాముడు, మంజుళ, పాల్గొన్నారు.

రైతు సంఘాన్ని బలోపేతం చేయండి

కుందుర్పి: మండల రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం బలోపేతానికి మండల రైతులు సమన్వయంతో పనిచేయాలని ఆ సంఘం మండల అధ్యక్షురాలు కుందుర్పమ్మ ,ఏఎఫ్ ఎకాలజీ జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. సోమవారం మండలంలోని బండమీదపల్లి శీతల గిడ్డంగిలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం ఎనిమిదో వార్షిక మహాసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంఘంలో 719 మంది వాటాదారులు ఉన్నారని, రైతులు పండించిన వివిధ రకాల పంటలను కొనుగోలు చేయడం, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఓలు శంకర్‌నాయక్, సతీష్, వెంకటేష్, ఓబుళపతి, రమేష్ పాల్గొన్నారు.

ఏసీబీ విచారణపై చర్చ

కళ్యాణదుర్గం: దుర్గం రెవెన్యూ కార్యాలయాలపై 'ఏసీబీ కన్ను' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనాలపై రెవెన్యూ డివిజన్ స్థాయిలో చర్చ జరిగింది. ఏసీబీ అధికారులు రాక, విచారణ తదితర అంశాలపై డివిజన్ కేంద్రంతో పాటు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బంది స్థాయి నుంచి అధికారుల వరకు చర్చించుకున్నారు. డివిజన్‌లోని ఓ డీటీ, ఇద్దరు వీఆర్వోలతో పాటు గతంలో పనిచేసిన ఓ డివిజన్ స్థాయి అధికారి అవినీతి అక్రమాలపై ఏసీబీ అధికారులు విచారణ చేసినట్లు సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో అవినీతి అధికారులందరిలో అలజడి మొదలైంది.

సాగు భూమికి పట్టాలివ్వాలి



కలెక్టర్‌కు సమస్యను విన్నవించేందుకు వచ్చిన గిరిజన సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలంలోని వీపీపీ తండా, ఎస్ఎస్‌పీ తండా, వీపీసీ తండా, పందికుంట తండ, జె.రాంపురం తండాలోని దాదాపు 120 మంది గిరిజనులు అటవీ భూమిని సాగు చేసుకుంటున్నారని, వీరికి సాగు పట్టాలు ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు గిరిజన సంఘం నాయకులు విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన అనంతరం వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు వచ్చిన సామానాయక్, శివాజీనాయక్, గోవిందనాయక్, తదితరులు సమస్యను వివరించారు.

వాణి వినిపించాలి .. నిధులు తేవాలి

- ప్రధాన సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపాలి
- బీటీ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై లేవనెత్తాలి
- ముంపు ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారానికి ఎదురుచూపు
- అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు ప్రజల విన్నపం

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత సోమవారం తొలిసారి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. పూర్తి స్థాయిలో కాకుండా కేవలం నాలుగు నెలలకు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఆర్థికశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు ప్రజావాణి వినిపించి, అందుకు తగ్గట్టు నిధులు తేవాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు. ప్రధాన సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యేలు చొరవచూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాల మేరకు సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చాలని పట్టుబట్టారు. ముఖ్యంగా రాయదుర్గం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్ర ఎన్నికల సమయంలో బీటీ ప్రాజెక్టును పావుగా వాడుకున్నారు. గెలిచిన తక్షణమే పనులు మొదలుపెట్టి నీరిస్తామని ఊరూరా హామీ ఇచ్చారు. ప్రస్తుత బడ్జెట్‌లో తగిన నిధులు రాబట్టేలా కృషి చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

– రాయదుర్గం/కళ్యాణదుర్గం/ఉరవకొండ:



బీటీపీకి సాగు నీరందించాలి



బీటీప్రాజెక్టుకు కృష్ణా జలాలు తీసుకొచ్చే హామీ నెరవేర్చాలి. కాలువ తవ్వకం పనులు త్వరితగతిన చేపట్టాలి. రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంత రైతుల సాగు, తాగునీటి అవసరాలు తీర్చే ఈ పనులకు బడ్జెట్‌లో ప్రాధాన్యత అంశంగా పరిగణించాలి. తగిన నిధులు కేటాయించాలి. ఆ దిశగా స్థానిక ఎమ్మెల్యేలు కృషి చేయాలి.

– నాగేంద్రప్ప, రైతు, కలుగోడు,రాయదుర్గం



వజ్రకరూరు వద్ద హంద్రీనీవా కింద సాగు అయిన వరి పంట నీరు లేక ఎండిపోయిన దృశ్యం

పెట్టుబడి సాయం అందించాలి



కొత్త ప్రభుత్వం ఏర్పడి 40 రోజులు గడుస్తున్నా రైతు సమస్యలపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరుణంలో ఎన్నికల హామీ మేరకు రూ. 20వేలు పెట్టుబడి సాయం సత్వరమే మంజూరు చేయాలి. రైతు సమస్యలతో పాటు మండలంలో గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వాటిని వెంటనే పునరుద్ధరించాలి.

– కిష్టప్ప, కుందుర్పి

దాహార్తిపై చర్చించాలి



ఉరవకొండ పట్టణంలో గత కొన్నేళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యపై అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే, మంత్రి కేశవ్ చర్చించాలి. తాగునీటిని స్టోరేజీ చేయడానికి అదనంగా మరో ఓహెచ్ఎస్ఆర్ నిర్మించడంతో పాటు ఉదిరిపికొండ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి. ఉరవకొండ నియోజకవర్గంలో ప్రజలు నీటి సమస్యతో అల్లాడుతున్నారు.దీనిపై దృష్టి పెట్టాలి.

– సాకే పురుషోత్తం, ఉరవకొండ

జీడిపల్లిని ఆదుకోవాలి



జీడిపల్లి గ్రామంలో రిజర్వాయర్ నీటితో గ్రామంలో ఊట నీరు ఇళ్లలోకి చేరి నరకయాతన అనుభవిస్తున్నాం. ఈ అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే చర్చించాలి. ప్రభుత్వం గ్రామాన్ని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందించి, మరోచోట ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణాలు చేపట్టాలి.

– గంగాధర్, జీడిపల్లి గ్రామం, బెళుగుప్ప మండలం



ఉరవకొండలో తాగునీటి కోసం కుళాయిల వద్ద వేచి ఉన్న జనం

ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలి



హంద్రీనీవా కింద 10 శాతం పెండింగ్‌లో ఉన్న డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీరు అందిస్తే పంటలు సాగుచేసుకుంటాం. ఎక్కడా కరువు పరిస్థితులు కన్పించవు. ప్రభుత్వం ఆయకట్టు రైతుల బాధలు గుర్తించాలి. కళ్ల ముందు నీరు పోతున్నా పొలాలకు మళ్లించుకోలేని దుస్థితిలో ఉన్నాం. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలి.

– పరమేష్, గడేహోతూరు గ్రామం, వజ్రకరూరు మండలం

చెరువులకు నీళ్లు ఇవ్వాలి



నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గంలోని 144 చెరువులకు సాగు నీరు ఇస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని చెరువులకు సాగునీళ్లు ఇవ్వాలి. చెరువులకు నీళ్లు తెచ్చే విషయంపై అస్లెంబీలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడి నియోజకవర్గంలోని ప్రజలు, రైతుల కోరికను నేరవేర్చాలి. అలాగే కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నింటినీ అమలు చేయాలి.

– ముకుందా, రైతు,తిప్పేపల్లి, కంబదూరు మండలం

హామీల అమలుకు చర్యలు తీసుకోవాలి



హామీలు అమలు దిశగా ప్రభుత్వం అసెంబ్లీలో చర్చ సాగించాలి. ప్రజలు ఎంతో ఆశగా సంక్షేమ పథకాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు రాయదుర్గం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలి. అవసరమైన చోట్ల రోడ్లు, డ్రైనేజీలు వేయాలి. స్థానికంగా యువతకు ఉపాధి మార్గాలు చూపేందుకు పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– మారేష్, 24వ వార్డు, రాయదుర్గం

వేదవతి హగరిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



కణేకల్లు–మాల్యం మార్గమధ్యంలో వేదవతి హగరిపై బ్రిడ్జి నిర్మాణం చాలా అవసరం. ఇటీవల భారీ వర్షానికి రోడ్డు కొట్టుకొని పోయింది. దీంతో ఈ మార్గంలో బస్సుల రాకపోకలు కూడా నిలిచిపోయాయి. ప్రస్తుతం మండలంలో అత్యంత ముఖ్యమైన పని ఇది. దీనిపై ఎమ్మెల్యే దృష్టి సారించి, బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. బస్సుల రాకపోకలు బంద్ కావడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– పాటిల్ భరత్, మాల్యం, కణేకల్లు మండలం

బీటీపీకి కాలువలు తవ్వి నీరు తేవాలి



కళ్యాణదుర్గం నియోజక వర్గంలో అభివృద్ధికి నోచుకోలేక కర్ణాటక సరిహద్దులో ఉన్న బ్రహ్మసముద్రం మండలంలో వర్షాలు వస్తేగానీ పంటలు పండే పరిస్థితిలేదు. వర్షాలు పడకపోతే కూలి పనులు కోసం బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి ఉంది. మా ప్రాంతం రైతులకు జీవనాడి అయిన భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్టు కు కాలువలు తవ్వి జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలి.

– కురుబ లోకేష్, బ్రహ్మసముద్రం

ఫోర్జరీ సంతకాలతో రూ.3.18 లక్షల స్వాహా

కళ్యాణదుర్గం: ఫోర్జరీ సంతకాలతో గ్రామ యానిమేటర్‌తో కుమ్మక్కయి రూ.3.18 లక్షలు స్వాహా చేశారని విట్లంపల్లికి చెందిన గీతాంజలి మహిళా సంఘం సభ్యులు ఆర్డీఓ రాణీ సుస్మిత దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ డాక్టర్ రాణీ సుస్మితతో ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యులు మాట్లాడుతూ తమ సంఘంలో సభ్యుల ప్రమేయం లేకుండా పాతలీడర్లు గ్రామయానిమేటర్‌తో కుమ్మక్కయ్యారని, సంతకాలు ఫోర్జరీ చేసి, డబ్బు స్వాహా చేశారని సంఘం సభ్యులు కవితమ్మ, లత, చిట్టెమ్మ, కళమ్మ, అచ్చమ్మ, రామాంజనమ్మలు తెలిపారు. యానిమేటర్ లక్ష్మీ నరసమ్మ భర్త ఎర్రిస్వామి సంఘం పాత లీడర్లతో కుమ్మక్కై సుమారు రూ.3.18 లక్షలకు పైగా నగదును సంఘం సభ్యులకు తెలియకుండానే డ్రా చేసినట్లు తెలిపారు. గతంలో యానిమేటర్ భర్త పలు సంఘాల్లో పొదుపు డబ్బు సైతం డ్రా చేయడంతో ఇటీవల అధికారులు రూ.95 వేలును రికవరీ చేసినట్లు గుర్తు చేశారు. స్పందించిన ఆర్డీఓ త్వరలోనే విచారణ జరిపిస్తామని, సంఘం సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



ఆర్డీఓను కలిసి బయటకు వస్తున్న గీతాంజలి మహిళా సంఘం సభ్యులు

ఈఓఆర్డీపై చర్యలు తీసుకోండి

కళ్యాణదుర్గం: విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఈఓఆర్డీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని దళిత, గిరిజన సంఘాల నాయకులు కోరారు. సోమవారం కళ్యాణదుర్గంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఈఓఆర్డీ తీరుపై నిరసన తెలియజేశారు. దళిత, గిరిజన సంఘం నాయకులు ఆర్‌కే రాజు, శివశంకర్ నాయక్, తిప్పేస్వామి నాయక్, ఎర్రిస్వామిలతో పాటు పలువురు పాల్గొని మాట్లాడారు. స్పందించిన ఎంపీడీఓ మరోసారి ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం దళిత, గిరిజన సంఘాల నాయకులు ధర్నాను విరమించారు.

విత్తన ప్రాసెసింగ్ యూనిట్ తనిఖీ

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరులో సర్వే నెంబర్ 102ఏ2లో ఏర్పాటు చేసిన విత్తన ప్రాసెసింగ్ యూనిట్ ఏఓ పెన్నయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి 2022లో సెంట్రల్ సీడ్ లైసెన్స్‌ను గుంటూరు వ్యవసాయ కమిషనర్ లైసెన్స్‌ను మల్లేశ్వర అగ్రోస్ ఏజెన్సీస్‌కి రాగులు, జొన్నలు, అలసందలు, గడ్డి తదితర విత్తనాల ప్యాకింగ్ కోసం అనుమతి ఇస్తూ సర్టిపై చేసిందని ఏఓ తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ లక్ష్మన్, యూనిట్ ఇన్‌చార్జ్ మహ్మద్, రైతులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు

బొమ్మనహాళ్:మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమవారం రాత్రి తనిఖీ చేశారు. తూ.కొ.శాఖ అనంతపురం ఇన్‌స్పెక్టర్ శంకర్ ఉద్దేహాళ్ గ్రామంలోని కిరాణా దుకాణాలను తనిఖీ చేశారు. హీరా కిరాణా షాపును తనిఖీ చేశారు. గోల్డ్ పామాయిల్ ప్యాకెట్‌ను తూకం వేసి, పరిశీలించారు. ఒక కిలోకు 100 గ్రాములకుపైగా తక్కువ రావడంతో దుకాణ యజమానికి రూ.40 వేలు జరిమానా విధించారు. తుకాల్లో తేడాలుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బయోభూతంపై కలెక్టర్ ఆరా

రాయదుర్గం: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో బయో వ్యర్థాల నిర్వహణ అస్తవ్యస్తతపై 'పొంచి ఉంది బయోభూతం' శీర్షికన శీర్షికను 'సాక్షి'లో కథనం సోమవారం ప్రచురితమైంది. దీనిపై జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. బయోవ్యర్థాల తరలింపు లో నెలకొన్న నిర్లక్ష్యంపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. పారిశుద్ధ్య కార్మికులను ఈ పనులకు వాడుకుంటే సహించేది లేదన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను హెచ్చరించాలన్నారు. సక్రమంగా బయో వ్యర్థాలు సేకరించకపోతే తప్పించే మార్గం చూడాలన్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ డీసీహెచ్ డేవిడ్ ఆయా ఆస్పత్రుల్లోని ఏఓ లకు తగిన జాగ్రత్తలు పాటించేలా ఆదేశించారు. డీసీహెచ్‌తో కలిసి బయో వ్యర్థాల నిర్వహణపై మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామన్నారు.

ఘనంగా కలశ ప్రతిష్ట

విడపనకల్లు: మండల పరిధిలోని గడేకల్లులో భీమలింగేశ్వర స్వామి రథోత్సవంలో భాగంగా సోమవారం కలశ ప్రతిష్ట చేశారు. ఉదయం భీమలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భీమలింగేశ్వస్వార స్వామికి మాంసం, సారా సమర్పించి, భక్తులు పూజలు చేశారు. మంగళవారం భీమలింగేశ్వరస్వామి రథోత్సవ వేడుకలు జరగనున్నాయి.



కలశ ప్రతిష్ట చేస్తున్న అర్చకులు

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

వజ్రకరూరు: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభంగా బోధించడమే జాతీయ విద్యా విధానం ఉద్దేశమని ఏంఈఓ తిమ్మప్ప అన్నారు. సోమవారం తట్రకల్లు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో జాతీయ విద్యా విధానం (2020) అమలులోకొచ్చి నాలుగేళ్లయిన సందర్భంగా వార్షికోత్సవం, శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక వనరులతో తయారు చేసిన బోధన అభ్యసనా సామగ్రిని ప్రదర్శించారు. ఈకార్యక్రమాన్ని ఏంఈఓ తిమ్మప్ప పరిశీలించి, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘురాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బోధన అభ్యసనా సామగ్రిని ప్రదర్శిస్తున్న విద్యార్థులతో ఎంఈఓ తిమ్మప్ప, ఉపాధ్యాయులు

శిక్షా సప్తాహ్ ప్రారంభం

బొమ్మనహాళ్: జాతీయ విద్యావిధానం నాల్గో వార్షికోత్సవం సందర్భంగా ఎంఈఓ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్ శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈనెల 28 వరకు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక వనరులతో బోధన సామగ్రి పదర్శనను పరిశీలించారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

కుందుర్పి: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని వైద్యాధికారిణి అనూషా తెలిపారు. సోమవారం స్థానిక కేజీబీవీలో వ్యక్తిగత శుభ్రత, రక్తహీనత, పాఠశాల పరిసరాల స్థితిగతులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారంతో పాటు రోజులు పాలు, గుడ్లు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు హిమోగ్లోబిన్ మరియు గ్రూపింగ్ రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓ నిర్మల, సిబ్బంది శశికళ, సుధాలక్ష్మి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బొమ్మనహాళ్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, మల్లీశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో మలేరియా, డెంగీ, చికున్‌గన్యా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం



కుందుర్పి: మండల కేంద్రంలో సోమవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పెద్దసరిగెత్తు సందర్భంగా వందలాది మంది భక్తులు పానకం బోనాలతో వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం, అదే రోజు సాయంత్రం జలధితో మొహర్రం వేడుకలు ముగుస్తాయని సర్పంచు మారుతేశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం : మండలంలోని కామక్కపల్లికి చెందిన తిరుపతయ్య, నీలావతి దంపతుల కుమారుడు తిప్పేరుద్ర అనంతపురంలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ఫీజులకు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ రూ.10వేలు ఆర్థికసాయం అందించాడు.

చాబాలలో పంట పొలాల పరిశీలన

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామంలో పంటలను ఏఓ మధుకర్ సోమవారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులు సాగుచేసిన కంది, వేరుశెనగ తదితర పంటలను పరిశీలించి, రైతులకు తగు సూచనలు ,సలహాలు అందించారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం తేమశాతం తక్కువగా ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. రెండు శాతం యూరియా వాడుకోవడం ద్వారా బెట్ట పరిస్థితులను అధిగమించొచ్చన్నారు. పంటల సాగులో రైతులు మెల కువలు పాటించాలని సూచించారు. వీఏఏ కళ్యాణి పాల్గొన్నారు.

కుష్టు బాధితుల గుర్తింపుపై సర్వే

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలో కుష్టువ్యాధి నిర్ధారణపై ఇంటింటా సోమవారం సర్వే చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. ఆగస్టు 31 వరకు కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఏఎన్ఎం పద్మావతి, హెల్త్‌అసిస్టెంట్ బాబావలి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాన డ్రైనేజీ పూడికతీతకు చర్యలు

రాయదుర్గంటౌన్:పట్టణంలోని కేబీ ప్యాలెస్ రోడ్డు, చికెన్ మార్కెట్ ఏరియా, లక్ష్మీబజార్ వరకు ప్రధాన డ్రైనేజీలో పూడికతీత పనులు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప డ్రైనేజీ పూడికతీత పనులను సోమవారం పరిశీలించారు. దాదాపు 20 మంది అదనపు కార్మికులను తీసుకుని పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ డ్రైనేజీ పూడికతత పకడ్బందీగా చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్, మేస్త్రీలకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శారదమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తహసీల్దార్‌కు ఘన సన్మానం



తహసీల్దార్ ఇందిరా రాణీని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కణేకల్లు: కణేకల్లు తహసీల్దార్ ఇందిరా రాణీని రెవెన్యూ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన బదిలీల్లో వైఎస్సార్ కడప జిల్లా రాజుపాలెం మండలం నుంచి ఈమె కణేకల్లుకు వచ్చారు. ఆర్ఐ అశ్వర్థనారాయణ, సీనియర్ అసిస్టెంటు గోవిందరెడ్డితోపాటు వీఆర్వోలు, సిబ్బంది తహసీల్దార్‌ను సన్మానించారు. ఎంపీడీఓ గూడెన్న, సబ్ ట్రెజరీ సిబ్బంది తహసీల్దార్‌ను సన్మానించారు.

దొంగ అరెస్ట్

బెళుగుప్ప: మండల పరిధిలోని కాలువపల్లిలోని సేవాలాల్, మారెమ్మ ఆలయాల్లో హుండీల కేసులో నిందితుడిని బెళుగుప్ప పోలీసులు హనిమరెడ్డిపల్లి వద్ద సోమవారం అరెస్టు చేశారు. ఎస్ఐ శివ తెలిపిన మేరకు.. కాలువపల్లి ఆలయాల హుండీలను ఎత్తుకెళ్లిన కేసులో నిందితుడు ధర్మవరం షేక్ ఫయాజ్‌ను అరెస్టు చేసి, విచారణ చేపట్టామన్నారు. నిందితుడు ధర్మవరం, శింగనమల, ధర్మవరం రూరల్ స్టేషన్ పరిధిలో సుమారు 10 కేసుల్లో పాత నేరస్తుడని తేలిందన్నారు. కాలువపల్లి ఆలయాల హుండీలకు చెందిన రూ.3వేల నగదుతో పాటు కదిరి పట్టణంలో చోరీకి గురయిన తమిళనాడు రిజిస్ట్రేషన్ ఉన్న స్కూటీని నిందితుడి నుంచి రికవరి చేసి రిమాండ్‌కు పంపామని ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలో 23 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ కిశోర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బాలగంగాధర్ తిలక్ స్కూల్, పాత ఈసేవ కేంద్రంలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలి పారు.

కుందుర్పి: మండలంలోని 10 గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ నమోదు క్యాంపులు ఉంటాయని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. 23న కుందుర్పి1, మలయనూరు1, సచివాలయాల్లోనూ, 24న కుందుర్పి2, మలయనూరు- 2, 25న ఎర్రగుంట, ఎనుములదొడ్డి-1 సచివాలయాల్లోనూ, 26న బసాపురం, ఎనుములదొడ్డి-2లోనూ, 27న నిజవళ్లి,మహంతపురం సచివాలయాలలో క్యాంపులు జరుగుతాయన్నారు.

బోయ,వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడిగా జనార్దన్

ఉరవకొండ: ఏపీ వాల్మీకి బోయ సంఘం మండలాధ్యక్షుడిగా విడపనకల్లు మండలం హావళిగికి చెందిన బసాపురం జనార్దన్ ఎంపికయ్యాడు. ఈమేరకు సోమవారం ఏపీ వాల్మీకి బోయ సంఘం హైపర్ కమిటీ నియామక ఉత్తర్వులు విడుదల చేసింది.